క్లుప్తంగా

శివాలయంలో గోపూజ



ఆలయంలో గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా ఆలయంలో లక్ష్మీ అమ్మ వారికి పంచామృతాభిషేకం, అలంకారం, కుంకుమార్చనతో పాటు మహా మంగళహారతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

చల్లంగ చూడు తల్లీ



విశేష అలంకరణలో చౌడేశ్వరిదేవి

రామసముద్రం : మండలంలోని గుంతయం బాడి గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి సప్త మాతృకల అమ్మవార్లకు కార్తిక శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణయ్య గారి రాఘవేంద్రరావు అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అలాగే ఆలయం వద్ద బెంగళూరుకు చెందిన సత్యనారాయణరావు కుటుంబసభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి చల్లంగ చూడు తల్లి అని వేడుకున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

తంబళ్లపల్లె : మండలంలోని కొటాల పంచాయతీ వసంతపురంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ రాజన్న ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ముసలికుంట వేదపండితులు పవన్‌కుమార్ ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు స్వామికి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు.

అపార్ అప్‌డేట్ పూర్తి చేయాలి



అపార్ అప్‌డేట్‌పై ఆరా తీస్తున్న డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి

తంబళ్లపల్లె : విద్యార్థుల పూర్తి సమాచారం సేకరణలో భాగంగా చేపట్టిన అపార్ అప్‌డేట్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన కన్నెమడుగు, తంబళ్లపల్లె సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆధార్ సేవలపై ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్‌తో ఆరా తీశారు. హౌస్‌హోల్డ్, జియోట్యాగింగ్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఓ థామస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది

పీలేరు : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. తలపుల పీహెచ్‌సీ పరిధిలో చెరుకువారిపల్లెలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నదోమలతో ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమల నిర్మూలన పద్ధతులతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దోమలతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఏఎన్‌ఎం రెడ్డి బీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

- మార్కెట్‌యార్డులో స్తంభిస్తున్న రవాణా
- స్థలాల ఆక్రమణ
- రోడ్డుకిరువైపులా బారులు తీరుతున్న వాహనాలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

గుర్రంకొండ : స్థానిక మార్కెట్‌యార్డు వద్ద నిరంతరం ట్రాఫిక్ స్తంభించి పోతోంది. యార్డులోని పలు ప్రాంతాల్లో టమాటా మండీల యజమానుల ఇష్టానుసారం స్థలాలను ఆక్రమించుకొన్నారు. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ మార్గంలో పయనించే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

వాహనాల పార్కింగ్‌కు స్థలమేది?

గుర్రంకొండ-వాల్మీకీపురం మార్గంలో మార్కెట్‌యార్డు ఉంది. ప్రస్తుతం టమాటా సీజన్ కావడంతో యార్డుకు ప్రతిరోజు వందలాది వాహనాలు వస్తుంటాయి. అయితే వాహనాల పార్కింగ్‌కు తగినంత స్థలం లేక పోవడంతో వాహనాదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంకాలమైతే యార్డులో వందలాది వాహనాలు చేరుకొంటున్నాయి. దీంతో యార్డులో వాహనాలు నిలిపేందుకు స్థలం లేక నానా కష్టాలు పడుతున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో వాహనాలు నిలిపేందుకు స్థలం లేక పోవడంతో గుర్రంకొండ-వాల్మీకీపురం మార్గంలోని రోడ్డుకిరువైపులా వాహనాలను నిలిపివేస్తున్నారు. గంటల తరబడి వాహనాలను నిలిపివేస్తుండడంతో నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో ఈ మార్గంలో పయనించే సాధారణ వాహనాలు వెళ్లేందుకు నానా కష్టాలు పడుతున్నారు. మార్కెట్ యార్డు అధికారులు వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మార్కెట్‌యార్డులో అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్

స్థలాలు దురాక్రమణ

మార్కెట యార్డులో అవసరమైన మేరకే స్థలం ఉంది. అయితే కొంతమంది టమాటా మండీల యజమానులు యార్డులోని స్థలాలను ఆక్రమించుకొన్నారు. దీంతో వాహనాల నిలిపేందుకు స్థలం కొరత ఏర్పడింది. వాహనాల పార్కింగ్ కోసం కొంత స్థలాన్ని కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుందని రైతులు అంటున్నారు. సాయంకాలం వేళ మార్కెట్‌యార్డు వద్దకు పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో అటు యార్డులోనూ ఇటు గుర్రంకొండ-వాల్మీకీపురం మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించి పోతున్నాయి. పోలీసులు ట్రాఫిక్ సమస్యను పట్టించుకొని పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం



గుర్రంకొండ మార్కెట్ యార్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్న విషయం వాస్తవం. కొంతమంది యార్డులోని స్థలాలను ఆక్రమించుకొన్నారు. మండీలకు కేటాయించిన స్థలంలోకాకుండా బహిరంగ ప్రదేశాల్లో కుడా టమాటా క్రేట్‌లు ఉంచుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పోలీసుల సహకారంతో సమస్యను పరిష్కరిస్తాం. – కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

ఇష్టపడి చదవండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న టీఎల్‌డీఓ లక్ష్మీపతి

కలకడ : ప్రభుత్వ, గురుకుల పాఠశాలలోని విద్యార్థులు క్రమశిక్షణతో ఇష్టపడి చదవాలని జిల్లా అభివృద్ధి అధికారి లక్ష్మీపతి సూచించారు. శుక్రవారం కలకడ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్‌తో కలిసి తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి 10వ తరగతిలో ఇప్పటివరకు పూర్తి అయిన పాఠ్యాంశాలు, తరగతి వారీగా కేటాయించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు పట్టికను తనిఖీ చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కంటే ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషితో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలు చేసుకోండి

నిమ్మనపల్లె : ఓటరు జాబితాలో నమోదు, సవరణలు చేసుకోవాల్సిందిగా తహసీల్దార్ ధనంజయులు సూచించారు. 23, 24 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎల్వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. వారివద్ద ఉన్న ఫొటో ఓటరు జాబితాలో పేర్లను సరిచూసుకుని, సవరణలు చేసుకోవాల్సిందిగా కోరారు. 18 సంవత్సరాలు పూర్తైన యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



కురబలకోట: సర్టిఫికెట్లతో విద్యార్థులు



ములకలచెరువు: విద్యార్థులతో ఉపాధ్యాయులు

కురబలకోట : ఏలూరు చింతల పూడిలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ముదివేడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురుహర్ష, సఫియా, సనా, యశనని, నందిని పాల్గొన్నారు. సెమీ ఫైనల్స్ వరకు వెళ్లి గట్టి పోటీ ఇచ్చారు. వీరి ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్లు అందజేశారు. హైస్కూల్ హెడ్మాస్టర్ బాలసుబ్రమణ్యం, హైస్కూల్ చైర్మన్ బావజాన్ వీరిని శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా హైస్కూల్ చైర్మన్ విద్యార్థులకు 30 స్పోర్ట్స్ షర్టులను అందజేసి వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ములకలచెరువు : అండర్ -19 రాష్ట్ర స్థాయి టెన్నికాయట్‌పోటీల్లో ములకలచెరువు మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత శుక్రవారం మాట్లాడుతూ ఏలూరు చింతల పూడిలో జరిగిన టెన్నికాయిట్‌లో మూడో స్థానంలో తనుశ్రీ నిలిచిందన్నారు. కర్నూలులో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ పోటీలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వాలు

గుర్రంకొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను దగా చేస్తున్నాయని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు విఠలం రమణారెడ్డి, జిల్లా కౌలురైతు సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు విమర్శించారు. శుక్రవారం మండలంలోని వంకాయలవారిపల్లెలో రైతులు, మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26 రాయచోటి కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహా ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. రైతుబంధు పథకం రబీ సీజన్ ప్రారంభమైన అమలు చేయకపోవడం దారుణమన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, వారికి కనీసం బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేయడం లేదని విమర్శించారు. జిల్లా హంద్రీనీవా జలాలు తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారని, రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 10 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకంలో రోజువారి కూలీ రేట్లు రూ.600కు పెంచాలని కోరారు. కరువు మండలాలకు ప్రభుత్వం సాయం వెంటనే ప్రకటించి ఉపాధిహామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాయచోటి కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి రామచంద్ర, సీఐటీయూ నాయకులు రాజేశ్వరమ్మ, మధురవాణి, చంద్రమ్మ పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రహదారి భద్రత మనందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ విజయకుమారి

పీలేరు : రహదారి భద్రత మనందరి బాధ్యత అని ఎంవీఐ విజయకుమారి అన్నారు. శుక్రవారం ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రహదారి భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని కోరారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ బాలకృష్ణ, షీ సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ, వైద్యాధికారి డాక్టర్ కార్తీక్‌కుమార్, రాయల సుధాకర్, ఆర్టీసీ డీఎం కుమార్, కళాశాల చైర్మన్ మాధవిలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

పీలేరురూరల్ : స్థానిక చిత్తూరు మార్గంలోని కాకులారంపల్లె పంచాయతీలో ఆటోనగర్‌లో ఇళ్ల స్థలాలను తహసీల్దార్ భీమేశ్వర్‌రావు పరిశీలించారు. సర్వే నంబరు 1074/3లో 1.54 ఎకరాల భూమిలో 2021లో తమకు మంజూరు చేసి స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరగకుండా అడ్డుపడుతున్నారని ఆటో కార్మికుల నాయకుడు బోదేషావలి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు పూజారి వెంకటరమణ అనే వ్యక్తి ఆ స్థలం తనదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీసీల్దార్ శుక్రవారం ఇళ్ల స్థలాలు పరిశీలించి, రికార్డులు పరిశీలించారు. నిర్మాణాలు, బోరు, శిలాఫలకం, విద్యుత్‌లైను పరిశీలించిన అనంతరం నివేదిక జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని, అంతవరకు ఎవరూ స్థలంలో ప్రవేశించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్మయి, వీఆర్‌ఓ శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ ప్రేమ్‌కుమార్ బాధితులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో ఇళ్ల స్థలాలు పరిశీలిస్తున్న తహసీల్దారు భీమేశ్వర్‌రావు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పీలేరురూరల్ : పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు, మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి పొందవచ్చునని, సుస్థిర ఆదాయాన్ని ఆర్జించవచ్చునని తెలిపారు. రబీలో వేరుశనగ, వరి, అలసంద టీపీటీసీ 29 రకం సాగు విధానం, తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కందిపంటలో వెర్రితెగులు, మారుకా మచ్చల పురుగు, శనగపచ్చల పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వైవీ. రమణరావు, పీలేరు, కేవీపల్లె ఏవోలు రమాదేవి, శ్రావణి, కరుణాకర్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త పీరుసాహెబ్, ఏఈఓలు ఇంద్ర, అనిత, నజీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌కుమార్‌రెడ్డి

ఎన్‌హెచ్‌ఏఏ కౌన్సిలర్‌గా కేవీ రమణ



పెద్దతిప్పసముద్రం : మండలంలోని పోతుపేటకు చెందిన కేవీ రమణను నేషనల్ హెల్ప్‌లైన్ అగేనిస్ట్ అట్రాసిటీ (ఎన్‌హెచ్‌ఏఏ) ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు పంపారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో సీనియర్ ఎస్సీ సమాజికవర్గానికి నాయకుడైన తనకు చోటు కల్పించడంపై కేవీ రమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2021లో ప్రవేశ పెట్టిన జాతీయ స్థాయి కలిగిన ఈ పర్యవేక్షణ కమిటీలో తనకు చోటు కల్పించడంపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌తో పాటు సాంఘిక సంక్షేమ శాఖ డీడీలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జరిగే అట్రాసిటీ కేసులకు సంబంధించి మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో కుల వివక్షత లేకుండా పనులు జరిగే విధంగా తనవంతు కృషి చేస్తానని రమణ పేర్కొన్నారు.

మదనపల్లె టమాటాకు ఆదరణ

కురబలకోట : టమాటా జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ దరఖాస్తు ప్రక్రియపై శుక్రవారం అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. మదనపల్లె పరిసర ప్రాంత రైతులు, వ్యవసాయ నిపుణులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల కార్యనిర్వాహకులు, ఎన్‌జీఓలు తదితరులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ మదనపల్లె టమాటాకు అంతటా పేరు, గుర్తింపు ఉందన్నారు. ఈ ప్రాంతంలో ప్రధాన పంట ఇదేనన్నారు. దీనిపై పరిశోధనల నిర్వహణకు అవకాశం ఉందన్నారు. సాగు పద్ధతులు, షెల్ఫ్ లైన్, మార్కెట్ విలువ మెరుగుపరచడంతో పాటు ఎగుమతి అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లనున్నామన్నారు. మరో వైపు టమాటా ఉత్పత్తి, పంపిణీ, సాగు సవాళ్లను పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. అసోసియేట్ డీన్ శివయ్య మాట్లాడుతూ జీఐ అనేది ఒక ప్రాంతంలో ప్రత్యేకంగా తయారయ్యే ఉత్పత్తులకు ఇచ్చే గుర్తింపు అని తెలిపారు. దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు.



మిట్స్ కళాశాలలో టమాటా జీఐ ట్యాగ్ ప్రక్రియపై సమావేశం

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎంపీ మిథున్‌రెడ్డి, నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి

మదనపల్లె : రాజంపేట ఎంపీ పీ.వి.మిథున్‌రెడ్డి గురువారం రాత్రి పట్టణంలో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. మదనపల్లె వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, ఏపీఎండీసీ మాజీ చైర్మన్ షమీమ్‌అస్లాం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు బాబ్‌జాన్ తదితరులతో కలిసి శ్రీరామ తులసీ కల్యాణమండపంలో జరిగిన పోతబోలు వైఎస్సార్ సీపీ సర్పంచ్ ఈశ్వరయ్య కుమారుడు రేవంత్ వివాహ వేడుకకు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, హజ్‌కమిటీ మాజీ డైరెక్టర్ ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ శాఖ ప్రేక్షక పాత్ర

బి.కొత్తకోట : బి.కొత్తకోట పట్టణంలో ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో రెవెన్యూశాఖ ప్రేక్షక పాత్ర వహించడం చర్చనీయాంశమైంది. బుధవారం మున్సిపల్, పోలీసు అధికారులు ఆక్రమణ తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ప్రజలు సహకరించడంతో చిన్న వివాదం కూడా తలెత్తకుండా ఆక్రమణలు తొలగించారు. అయితే ఇందులో కీలక పాత్ర పోషించాల్సిన రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

మురికి కాలువ ప్రామాణికమా

పట్టణంలో ఆక్రమణలు తొలగించే ముందు రెవెన్యూ అధికారులు వాటిని గుర్తించాల్సి ఉంది. ఆ తర్వాతనే పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాలి. అయితే ఇక్కడ రెవెన్యూ అధికారుల సహకారం లేకపోవడం వలన కేవలం నగర పంచాయతీకి చెందిన మురికినీటి కాలువల ఆధారంగా ఆక్రమణలు గుర్తించి తొలగించారు. రెవెన్యూ రికార్డులు ఆధారంగా రోడ్ల వెడల్పు ఎంత, ఎంత మేరకు ఆక్రమణలు జరిగాయో ముందుగా గుర్తించాలి. అయితే కాలువలు దాటి వచ్చిన ఆక్రమణలను మాత్రమే తొలగించారు. కాలువలు లేని చోటు ఆక్రమణలను గుర్తించలేదు. మున్సిపల్ కమిషనర్ పల్లవి, సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. బి.కొత్తకోట పట్టణంలో ఆక్రమణ తొలగింపుకు రోడ్ల సర్వే బాధ్యత తమది కాదని రహదారి భవనాల శాఖ ఈఈ అరవిందా దేవి తెలిపారు. రెవెన్యూ రికార్డుల ద్వారా అధికారులు రోడ్ల వెడల్పును గుర్తించాల్సి ఉంటుందని చెప్పారు.



బి.కొత్తకోటలో ఆక్రమణల తొలగింపు శిథిలాలను తరలిస్తున్న దృశ్యం

25న లక్ష బిల్వార్చన

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. ఉదయం రుద్రాభిషేకం, రుద్రహోమం, లక్ష బిల్వార్చన జరుగుతుందన్నారు. కార్తీక మాసంలో విశేషపూజలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు స్వామిని దర్శించుకోవాలని కోరారు.

వీఆర్‌ఓల సంఘ అధ్యక్షుడిగా శ్రీరాములు

బి.కొత్తకోట : మండల వీఆర్‌ఓల సంఘానికి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బి.శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా జి. వరదరాజులు, కార్యదర్శిగా ఎం. జయరామిరెడ్డి, సహాయ కార్యదర్శిగా పి.వెంకటరమణ, కోశాధికారిగా ఏ. మల్లికార్జున, సలహాదారులుగా పిఎస్.రాంప్రసాద్, ఎస్.కోటిరెడ్డి, పి. రజినీకాంత్ డి.నాగేంద్ర, కార్యవర్గ ఎన్నుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్యసాయిజిల్లా తనకల్లు మండలం సదుం గ్రామం కొక్కంటిక్రాస్‌కు చెందిన అల్లాబక్షు కుమారుడు ముబారక్(26) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో స్నేహితుడితో కలిసి పుంగనూరుకు వెళుతుండగా మార్గమధ్యంలోని మదనపల్లె రింగ్‌రోడ్డు బైపాస్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దమండ్యం మండలం కోటకొండ తండాకు చెందిన వెంకటరమణ నాయక్ కుమారుడు గోపీనాయక్(27) సొంతపనులపై ద్విచక్రవాహనంలో వస్తుండగా, గుర్రంకొండ వద్ద టమాటా టెంపో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నంబూరిపూలకుంటకు చెందిన వెంకటరమణ(50) తన కుమారుడు నరేష్(10)తో కలిసి ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై వస్తుండగా, గుర్రంకొండ సమీపంలో వాహనం బ్రేక్‌వైర్ తెగిపోవడంతో అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

కలికిరి : పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధ అన్నారు. మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలో 104 వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విష జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

కేవీపల్లె : మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం అడిగి తెలుసుకున్నారు. ఈ సారి అంతకంటే ఎక్కువ ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఇప్పటి వరకు అపార్ నమోదు కాని విద్యార్థులు త్వరతగతిన నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుధాకర్